# 14. భలే వధువు

రఘు చెప్పిన మాటలు విన్న లీల బాగా ఆలోచించింది. తమకున్న ఆస్తి స్వల్పం. తనకంత కట్నమిచ్చి పెళ్ళిచే యడం సాధ్యంకాని పని. అందని పండ్లకై ఆశించడం అవి వేకమని నిర్ణయించుకొని రఘుతో అంది- రఘూ! కోరినంత కట్నంతేందే మీ నాన్నగారు మన పెళ్ళికి ఒప్పుకోరు. మాకా అంత శక్తిలేదు. మీతో వియ్యమందాలని ఆశించుట గగన కుసుమాల్ని ఆశించడంలాంటిది. అందుకే మీ నాన్న గారు చెప్పినట్లు విని నన్ను మర్చిపో" అంది.

"లీలా! ఇన్నిరోజుల సహచర్యంలో నీవు నన్నర్థం చేసుకొన్నదింతేనా? తుచ్ఛమైన డబ్బుకోరకై మనస్ఫూ ర్తిగా ప్రేమించిన నిన్ను వదులుకోవాలా? ఇది సాధ్యమా లీలా? చెప్పు" అన్నాడు బాధాపూరిత మనస్కుడై రఘు.

"రఘూ! డబ్బుమనిషైన మీ నాన్నగారి నెదిరించి పెళ్ళిచేసుకోవడం సాధ్యమా? చేసుకున్నా సుఖపడగలమా? నన్ను మరచిపోవడం తప్ప వేరే మార్గం తోచడంలేదు" అన్నది కన్నీటితో లీల.

"లీలా! నీవు లేందే జీవితంలో సుఖపడలేను. పెళ్ళి విషయంలో మసిద్దరం కన్న బంగారు కలలు మా నాన్నగారి ధన దాహానికి బలికావడానికి వీల్లేదు. ఏదైనా ఉపాయం ఆలోచించు" అని లీల తొడలపై తలమోపి చంటిపిల్లాడిలా బ్రతిమాలుతున్న ధోరణిలో అన్నాడు రఘు.

—కాలువ మల్లయ్య

తనకుమాత్రం రఘును వదలి ఉండటం సాధ్యమా? బాగా ఆలోచించింది ఉన్నట్టుండి లీల. "నాకొక ఉపాయం తోచింది చెప్పనా?" అన్నది హుషారుగా. "ఏం ఉపాయం చెప్పు లీల! త్వరగా చెప్పు" అన్నాడు ఉత్సాహంగా రఘు. రఘు చెవిలో తన పథకంగూర్చి చిన్నగా చెప్పింది లీల— "అమ్మ బాబోయ్, అంత ధైర్యమే" అన్నాడు రఘు "ఏం మగాడివికావా? మాట్లాడటానికి నేనున్నానుగా- నీవు చేయ వల్సిందల్లా నేను అన్నదానికి ఊఁ కొట్టడమే. దీంతో మీ నాన్నగారుకూడా మారిపోవచ్చు" అన్నది లీల.

"ఎంతైనా ఘటికురాలివే" అని చెంపపై గిల్లాడు రఘు. "నీవు నోరు తెరిచావంటే మన పథకం ఎదురుతిరుగుతుంది. మా నాన్న చాలా ఇబ్బందుల్లో పడతాడు. కొంచెం ధైర్యం చేయి. డైలాగ్సన్నీ రిహార్సిల్‌చేసి ఉంచుకో" అంది లీల.

"ఇంతటి శ్రీమతిగారుండగా నాకు భయందేనికి? ఆజ్ఞాను బద్ధుణ్ని" అన్నాడు రఘు. "చూస్తాగా మీ ప్రతాపం" అని ఓరచూపు చూసింది లీల. 'చూ పెడ్తాలే' అని కొంటె నవ్వు నవ్వాడు- అప్పటికి విడిపోయారు.

లోపల భయంగా ఉన్నా కూతురు చెప్పినట్టుగా లక్షా ఇరవై వేల కట్నాని కొప్పుకొని, నలభై వేలు వరపూజచేసి మిగతా డబ్బు పెండ్లిలో ఇవ్వడాని కొప్పుకుని వచ్చాడు శ్రీపతిగారు. పెండ్లి నిశ్చయమైంది. శ్రీపతిగారిల్లు బంధు జనులతో కిటకిటలాడుతుంది. పెండ్లి పందిట్లో బ్రాహ్మడు

మంత్రాలు పఠిస్తున్నాడు. తాళిబొట్టు రఘు చేతికిచ్చి కట్టు మన్నాడు రఘు వంగి తాళిబొట్టు కట్టే సమయానికి భూపతి 'ఆగు' అని గర్జించాడు. అందరూ అవాక్కైపోయారు.

'మిగతా కట్నం డబ్బివ్వందే తాళి కట్టడానికి వీల్లేదు' అన్నాడు. ఈ మాటలకొరకే ఎదిరిచూస్తున్న శ్రీపతి బంగారం, డబ్బు తెచ్చి భూపతి కిచ్చాడు. పెళ్ళి జరిగింది. భోజనాదులు ముగిసాయి. వధూవరులను వరునింటికి తీసుకుపోయే సమయ మాసన్నమైనది. రఘు, లీల ఒకే రూంలో కూర్చొని మాట్లాడుకుంటున్నారు.

"ముహూర్తం మించిపోతుంది- తొందరగా తయారుకండి. పల్లకి సిద్ధంగా ఉంది" అన్నాడొక పెద్దమనిషి వధూవరులతో.

అపుడు లీల "మా మామగారిని తోలించండి- రఘును మా నాన్నగారు కొన్నారు. అతడిక్కన్నే ఉంటాడు- మీరు వెళ్ళండి" అంది నిర్భయంగా. లీల మాటలు విన్న ఆడవాళ్లు ముక్కులపై వేళ్ళువేసుకున్నారు. 'ఇదేం విడ్డూరమమ్మా!' అనుకుంటూ పోయి భూపతిగారిని పిలుచుకొచ్చారు. అంతా ఆ గదిముందు గుమిగూడారు. ఇసుక వేస్తే శబ్దమయ్యేంత నిశ్శబ్దంగా వుంది వాతావరణం. ఏం జరుగుతుందో చూద్దామని అంతా కుతూహలంగా ఉన్నారు.

"ఏమ్మా లీలా, ఏమో అన్నావట!" అన్నాడు భూపతి.

"నేనేమన్నాన్నూ? ఏమీ అనలేదే" అన్నది లీల నెమ్మదిగా.

—కాలువ మల్లయ్య

"ఇప్పుడే రఘును కొన్నాననన్నావట- అబద్ధమాడుతు న్నావా? అబద్ధాలాడటం, మాటలు తప్పడం లేకుంటే మను గడ సాగదు మామగారు! అవును నేనాయన్ను కొన్నాన న్నాను తప్పా?" ఆ మాటలు విని అంతా నిశ్చేష్టులయ్యారు ఎవరినోటా మాటరాలేదు. తాను తన కొడుకుతో అన్న మా టలను తనకే అప్పగిస్తున్న మాటలు విని అయోమయస్థితిలో పడ్డాడు. తుదకు సర్దుకొని 'లీలా! నీవనేదేమిటి? రఘును నీవు కొన్నావా?' అన్నాడు కోపంగా. 'అవును మామగారు. మీ ఇంట్లో బేరం జరుగుతుంటే మా నాన్నగారు సవాలు పెంచి లక్షా ఇరవై వేలకు కొన్నారు. ఒకటికాదు రెండుకాదు; లక్షా ఇరవై వేలు. మీకా్కవల్సింది డబ్బేగా? డబ్బు ముట్టిందిగా ఇంకా ఎందుకున్నారు? రఘు ఇక్కడే ఉంటాడు వెళ్ళండి. అంత డబ్బిచ్చి మీ ఇంట్లో చాకిరీ చేయాల్సిన అగత్యం నాకు లేదు-' అన్నది లీల నెమ్మదిగా. "లీలా నీవేంమాట్లాడు తున్నావో తెలిసే మాట్లాడుతున్నావా? కట్నం యిచ్చి కొను క్కున్నాడంటావా? ఆశ్చర్యంగా ఉందే" అన్నాడు భూపతి. "హు! కట్నమెందుకివ్వాలండీ కట్నం! ఆడపిల్ల కంఠాల కురి త్రాడైన కట్నం ఎందుకివ్వాలి? నేనుకూడా రఘుతో సమా నంగా యం. ఏ. చదివానే; పురుషులతో సమాన అర్హతలున్నా లేకున్నా, ఇంకా ఎక్కువ అర్హతలున్నా స్త్రీయే పురుషునికి ఎందుకివ్వాలి కట్నం? ఆడపిల్లల జీవితాలతో ఆటలాడుకుం టున్న మీ పురుషులు మారేదెప్పుడు? ఈ దొంగ వ్యాపార

మిలా ఎన్నాళ్లు సాగాలి? మామగారు! నా మాటలు మీకు ఆశ్చర్యంగా ఉన్నాయా? డబ్బుకొరకై పరస్పరం గాఢంగా ప్రేమించుకున్న ప్రేమికులను విడదీయడం ఆశ్చర్యంగా లేదా? డబ్బుకొరకై పెద్దలైన మీరు మాట తప్పమని మీ కొడుక్కు సలహానివ్వడం ఆశ్చర్యంగా లేదా? డబ్బుకొరకై పేదవాళ్ళను చులకనగా చూస్తూ వాళ్ళే కోరినంత డబ్బు యిస్తే పెళ్ళికొప్పుకోవడం ఆశ్చర్యంగాలేదా? ఏ డబ్బుకొరకైతే మీ రిన్నిపాట్లు పడ్డారో ఆ డబ్బు మీకిచ్చాము. మీ అబ్బాయిని కొన్నాము. మీరు డబ్బు పట్టుకొని వెళ్ళండి" అన్నది ఆవేశంగా లీల.

లీల మాటలకు ఆగ్రహోదగ్రుడైన భూపతి "రఘూ! ఆడదంతగా మాట్లాడుతుంటే బెల్లంకొట్టిన రాయిలా చూస్తు ఊర్కొంటావేరా? ఆ మాటలన్నీ వినరావడంలేదా? వాళ్ళ డబ్బు వాళ్ళ ముఖానకొట్టి- నీవురా! బంగారం లాంటి పిల్లనుచూసి పెళ్ళిచేస్త" అన్నాడు భూపతి.

"నాన్నగారూ! నాకు లీల చెప్పిందే నిజమని తోస్తుంది. అంగట్లో కోడెను బేరమాడినట్టుగా నన్ను బేరమాడారు. ఆ బేరంలో ఎక్కువ ధర పలికి శ్రీపతిగారు నన్ను కొన్నారు. నేనమ్ముడుపోయాను. నాన్నగారూ, నేనమ్ముడుపోయాను. మీరు వాంచించిన కట్నం వచ్చింది. మనస్ఫూర్తిగా ప్రేమించి, అగ్నిసాక్షిగా పెళ్లాడిన లీలను నేను వదులుకోలేను. నేనిక్కడే ఉంటాను. మీరు వెళ్ళండి—" అన్నాడు

బాధాపూరిత కంఠంతో రఘు.

రఘు మాటలువిన్న భూపతిగారు స్తబ్ధుడై నిలుచు న్నాడు. తన ఒక్కగానొక్క సంతానమైన రఘు లేకపోయి నచో తనకు డబ్బెందుకు? ఇంతమందిలో తన కొడు కలా మాట్లాడుతాడని భూపతిగా రూహించలేదు. ఏం మాట్లా డాలో తోచక ఆలోచనామగ్నుడై యున్న భూపతి నుద్దేశించి లీల "మామగారూ, విన్నారా! మీ కొడుకు మాటలు? కొడుకు పుట్టి, తండ్రిని చదివేసినట్టు మీకే నీతులు చెప్పు తున్నాడు. ఏదో పెళ్లి చేసుకుంటానన్న నా కిచ్చిన చిన్న మాటను కాదనలేక మీతో వాదన పెట్టుకున్నాడానాడు. బొమ్మలాటగా కట్టిన నూలుపోగును తెంపితే పోయేదానికి ఆడదాన్నయిన నా మాటలు నచ్చుతున్నా యంటున్నాడు ఈనాడు. అసలాతనికి బ్రతికే నేర్పే లేనట్టుంది. లోకజ్ఞానం మరీశూన్యం మామగారు, మీ ఆస్తినుండి చిల్లిగవ్వకూడా యివ్వనని బెదిరించండీ- అప్పుడుగాని తిక్క కుదుడుతుంది. ఈ నూలుపోగు నొక తెంపు తెంపి మరొక బంగారంలాంటి పిల్లతో సుఖపడ్తాడు" అన్నది ఆవేశంగా- ఆవేదనగా.

అవనతవదనుడై నోట మాటరాక నిల్చున్న భూపతిని చూస్తూ మళ్ళీ లీల "బెదిరించండి- లేదా మీ పలుకుబడి నుపయోగించి, గూండాల రప్పించి మా కాళ్లు చేతులుకట్టి, పల్లకీలో వేయించుకొని తీసుకొనిపొండి. లక్షల ఏళ్లు గడి చినా, ప్రపంచ మెంతో పురోగమించినా ఈ అణుయుగంలో

కూడా ఆడదంటే బానిసేనన్న నిజాన్ని ఋజువు చేయండి మామగారూ! తరతరాలుగా ఆడదానికి సాగుతున్న అన్యాయాన్ని నిరాఘాటంగా కొనసాగనివ్వండి" అన్నది. కంటి వెంట జలజలా నీళ్లు కారగా.

లీల మాటలు భూపతిలో నైజాన్ని ఈ సంఘంలో పురుషాధిపత్యాన్ని ఎక్స్‌రే తీసినట్టుగా బయటపెట్టాయి. తన ప్రవర్తనగూర్చి ఆలోచించాడు. లీల మాటలకు తనపై తనకే అసహ్యం వేసింది. తన నీచత్వానికి సిగ్గుపడ్డాడు. వంచిన శిరస్సు మెల్లగా ఎత్తి "లీలా! నీవు నాపాలిటి దేవతవు. ధనమదాంధతచే కప్పుకపోయిన నా కళ్ళను తెరిపించావు. డబ్బే అన్నిటికీ మూలమని భ్రమించాను. కాని ఇంతటి మంచి మనసుగల మనుషులుంటూరా? అని ఇప్పుడే తెలుసుకున్నాను. డబ్బుకొరకై మీ పవిత్ర ప్రేమికుల విడదీయుటకు వెనుకంజ వేయని నన్ను క్షమించు లీలా! ఏ డబ్బుకొరకైతే ఇన్ని నాటకాలాడానో ఆ డబ్బును మీ నాన్నగారికి తిరిగి యిస్తాను. డబ్బుకంటే ఎన్నోరెట్లెక్కువైన నీలాంటి కోడలు దొరికినందుకు నా కెంతో గర్వంగా ఉంది." అని మొత్తం పైకం శ్రీపతి చేతిలోపెట్టి "పల్లకిని సిద్ధం చేయించండి" అన్నాడు భూపతి.

పల్లకిలో కూచున్న లీలా రఘులు ముసిముసిగా నవ్వుకున్నారు, తెలుకుంటలో జరిగిన ఈ సంఘటనలు తెలుసుకున్న ఆడపిల్లల తండ్రులు లీలను వేనోళ్ళ పొగిడారు.

—కాలువ మల్లయ్య

మొగపిల్లల తండ్రులు ముఖాలు చిట్లించారు. అభ్యుదయ వాదులు లీల ధైర్య సాహసాలకు మెచ్చుకున్నారు. ఆడదాన్ని బానిసగాచూచే అభివృద్ధినిరోధకులకు లీల ప్రవర్తన మింగుడు పడలేదు.

(చిత్రిక 8-15 మార్చి)

# 15. ప్రజా సేవయే మా కర్తవ్యం

అది పనిచేసే ప్రభుత్వం ఏలుబడిలో ఉన్న రాజ్యంలోని ప్రభుత్వ సంస్థ. పేరు ఆర్. టి. సి. "ప్రజా సేవయే మా కర్తవ్యం" అన్న నినాదంతో నిర్విరామంగా ప్రజాసేవ కంకితమైన సంస్థ అది. ఒకే సంవత్సరంలో మూడుసార్లు ప్రయాణీకుల టికెట్ల ధర పెంచడంకూడా వాళ్ల ప్రజా సేవలో ఒక భాగమే. అట్టి ప్రజాసేవ కంకితమైన సంస్థ వారి బస్సు దాదాపు 250 కి. మీ. దూరంలోనున్న ఒక పట్టణం నుండి రాజధానికి బయలుదేరింది. క్రిక్కిరిసిన జనంతో పురుటి నొప్పులతో బాధపడుతున్న స్త్రీలా ఆపసోపాలు పడుతూ ఆ బస్సు నడుస్తూంది.

ప్రజాసేవయే ధ్యేయంగా భావించిన కండక్టర్ ప్రజలకు సహాయముచేయటానికై దగ్గర స్టేషన్లకున్న 3 రూ॥ల టిక్కెట్టుకు బదులు 2-50 పై. టిక్కెట్టు తీసుకొన్న టికెటు చించకుండా డబ్బులు జేబులో వేసుకుంటున్నాడు. అది